రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రహీంఖాన్‌పేటలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 6 : వివాదాలు లేని భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, రాఘవాపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారులతోపాటు పట్టా భూములు ఉన్నప్పటికీ పాస్ పుస్తకాలు లేకపోవడం, తక్కువ, ఎక్కువ భూములు సరిచేయకపోవడం వంటి సమస్యలకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజారాం, మండలాల తాసీల్దార్లు లావణ్య, శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన

నాతాళ్లగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

వలిగొండ, మే 6 : మండలంలోని నాతాళ్లగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి మంగళవారం పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామంలో సన్న బియ్యం పంపిణీ, గ్రామ నర్సరీతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, ఏపీఎం జాని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి : ఆర్డీఓ

ఆత్మకూర్ (ఎం) : రహీంఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

బీబీనగర్, మే 6 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపురం, రుద్రవెల్లి, వెంకిర్యాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇన్‌చార్జి తాసీల్దార్ భగత్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని, తూకం వేసిన వెంటనే ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రహీంఖాన్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. లారీల కొరత ఉన్నదని, ధాన్యం వేగవంతంగా కొనుగోలు చేయడంలేదని రైతులు ఆర్డీఓకు వివరించారు. వెంటనే లారీల కాంట్రాక్టర్‌కు ఆర్డీఓ ఫోన్ చేసి రోజుకు 2లారీలు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్ ఉన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు : ఏడీఏ

సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

భూదాన్ పోచంపల్లి, మే 6 : రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని భువనగిరి ఏడీఏ వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని జలాల్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం, పంట మార్పిడి, తక్కువ నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ రైతులు ఒకే రకం పంటలు వేయడం వల్ల భూమిలో సారం నశిస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గట్టి తాలు సమస్య ఉన్నందున వరిలో ఆర్ఎన్ఆర్ 28361 రకం వాడాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, ఏఓ ఎ.శైలజ, వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.రాములు, వై.చంద్రమోహన్, సీహెచ్ బాలచంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజిరెడ్డి, లాలయ్య, ఏఈఓలు ప్రియాంక, శ్వేత, నరేశ్, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి : శాస్త్రవేత్త శ్వేత

మైలారంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్వేత

బొమ్మలరామారం, ఏప్రిల్ 6 : రైతులు తమ పొలంలో ఒకే రకమైన పంటలు పండించకుండా పంట మార్పిడి విధానం పాటిస్తే అధిక దిగుబడిని సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త శ్వేత అన్నారు. మండలంలోని హాజీపూర్, రాంలింగంపల్లి, మైలారం గ్రామాల్లో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సాగులో తక్కువ యూరియా, రసాయనాల వినియోగం, రసీదులు భద్రపరచడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి విధానం వల్ల లాభాలు, చెట్లను పెంచడం వంటి విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఉపేందర్‌రెడ్డి, లక్ష్మీపురం భారతి, శకుంతలాదేవి, తేజస్విని, పీఏసీఎస్ డైరెక్టర్‌శ్రీకాంత్‌రెడ్డి, ఏఈఓలు వెంకటేశ్, మౌనిక, రాజశ్రీ పాల్గొన్నారు.

అందాల పోటీలను విరమించుకోవాలి : ఎస్ఎఫ్ఐ

భువనగిరి అర్బన్, మే 6 : మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచే అందాల పోటీలను విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ గర్ల్స్ జిల్లా కన్వీనర్ కూకుట్ల శివాని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలనుకుంటున్న అందాల పోటీలతో అమ్మాయిలపై చెడు ప్రభావం ఎక్కువవుతుందని పేర్కొన్నారు. అమ్మాయిలకు రక్షణ లేకుండా పోతుందని, చిన్న పిల్లలపై లైంగికదాడులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సినిమా, యాడ్స్‌ల పేర్లతో అమ్మాయిల వేషధారణలతో చూపిస్తున్న పరిస్థితి మన రాష్ట్రంలో ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వాటిపై చర్య తీసుకోకుండా మిస్ వరల్డ్ పేరుతో ఇలాంటివి ఎంకరేజ్ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. అమ్మాయిలను చదువుల పరంగా ముందుకు సాగాలని చెప్పాల్సిన ప్రభుత్వమే మహిళలను కించపరిచేలా అందాల పోటీలను నిర్వహించడం దౌర్భాగ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాలేజీలు, హాస్టళ్లలో సరైన వసతులు, సదుపాయాలు లేక అమ్మాయిలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా మిస్ వరల్డ్ పోటీలపై దృష్టి పెట్టడమేంటని ప్రశ్నించారు. ఈ పోటీలకు అయ్యే ఖర్చులను విద్యార్థినులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే గడ్డం వివేక్

రేణికుంటలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే వివేక్

రాజాపేట, మే 6 : బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, అలాంటి మహనీయుడి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మండలంలోని రేణికుంటలో నెలకొల్పిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరివాడైన అంబేద్కర్ మహానీయుడి జయంతి వేడుకలను దేశ విదేశాల్లో జరుపుకొంటున్నారన్నారు. సమానత్వం కోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహానుభావుడు అని కొనియాడారు. మహనీయుల చరిత్ర భావితరాలకు అందించేందుకు విగ్రహాలు నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గోపగాని బాలమణి, బుడిగె పెంటయ్యగౌడ్, సట్టు తిరుమలేశ్, చింతలపూరి, వెంకట్రామ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బూరుగు భాగ్యమ్మ, కరాటే బాలు, జూకంటి ప్రవీణ్‌కుమార్, ఇంజ నరేశ్, రాఘవరెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, నాగార్జున, నగేశ్, మల్లేశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

భువనగిరి అర్బన్, మే 6 : కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తిరందాసు గోపి మీటింగ్ హాల్‌లో మంగళవారం జరిగిన సీఐటీయూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయని, 8 గంటల పనిని 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ రంగాలకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. కార్మిక ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తూ జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుతో మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా, గొరిగే సోములు, నాయకులు మాయ కృష్ణ, సురేందర్, సత్యనారాయణ, ఈశ్వర్, వెంకటేశం, పొట్ట యాదమ్మ, గణేశ్ పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడి మృతి

వలిగొండ, మే 6 : ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన బట్టు సుధాకర్ చిన్న కుమారుడు చరణ్ (12)కు చెవిటి, మూగ వైకల్యం ఉంది. ఆ బాలుడు సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో సుధాకర్ సోదరుడి కొడుకు బట్టు గౌతమ్‌తో కలిసి ఈత కోసం అదే గ్రామానికి చెందిన తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. వారికి ఈత రాకపోవడంతో ఒడ్డున ఉండి స్నానం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు చరణ్ కాలుజారి బావిలో పడిపోయాడు. అదిచూసి భయపడిన గౌతమ్ ఇంటికి వెళ్లి ఎవరికీ చెప్పలేదు. సాయంత్రం వరకు చరణ్ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలేదు. బావిలో పడిన విషయాన్ని గౌతమ్ కుటుంబ సభ్యులకు చెప్పడంతో బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్లతో నీటిని తోడేశారు. చరణ్ శవమై కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

వైన్ షాపులో చోరీ

రామన్నపేట, మే 6 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మి వైన్స్‌లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల కేంద్రానికి చెందిన కోనేటి ఎల్లయ్య రామన్నపేట బస్టాండ్ ముందు భాగంలో వైన్స్‌ను నడుపుతున్నాడు. సోమవారం రాత్రి 10గంటలకు వైన్స్‌కు తాళం వేసి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి కౌంటర్‌లో డబ్బులు కనిపించలేదు. కౌంటర్ వెనుక వైపు ఉన్న రూములోకి వెళ్లి చూడగా వెంటిలేటర్ పగులగొట్టి ఉంది. వెంటిలేటర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి షాపులోకి చొరబడి సుమారు ఐదు లక్షల నగదు దొంగిలించుకుపోయాడని బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

గొర్ల షెడ్ అక్రమ నిర్మాణంపై విచారణ

బొమ్మలరామారం, ఏప్రిల్ 6 : మండలంలోని ఖాజీపేట గ్రామంలో 268, 360 సర్వే నెంబర్లలో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న భారీ గొర్ల షెడ్ నిర్మాణాన్ని అపాలని గ్రామస్తులు కలెక్టర్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం డీపీఆర్ఓ ఆదేశాల ప్రకారం ఎంపీఓ మాలిని ఖాజీపేటలో నిర్మాణంలో ఉన్న షెడ్‌ను పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. పైఅధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు నరేందర్, విజయ్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

9న సీజ్ చేసిన ఇసుక వేలం

చౌటుప్పల్, మే 6 : మండలంలో ఇటీవల సీజ్ చేసిన 80 టన్నుల ఇసుకను ఈ నెల 9న బహిరంగ వేలం వేస్తున్నట్లు తాసీల్దార్ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాసీల్దార్ కార్యాలయం ఎదుట వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని సొంత ఖర్చులతో రవాణా చేసుకోవాలని సూచించారు. వేలం పాడేవారు నిర్మాణ అనుమతుల పత్రాన్ని ముందే సమర్పించాలని పేర్కొన్నారు.

వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా లక్ష్మణ్

రామన్నపేట, మే 6 : వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బైరబోయిన లక్ష్మణ్ ఎన్నికయ్యారు. టీఎస్ జీఓ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ పక్షాన సంక్షేమ వసతి గృహ అధికారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య

భువనగిరి అర్బన్, మే 6 : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఆదివాసీ ప్రాంతాల్లో మోహరించిన సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మంగళవారం పౌర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేస్తామని ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారతం దండకారణ్యంలో లక్షలాది మంది సైనిక బలగాలతో వైమానిక దాడులకు పాల్పడుతూ ఆదివాసీ, గిరిజనులను కాల్చి చంపడం సరికాదన్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలతో పారిశ్రామిక ఒప్పందాలు చేసుకుని ఖనిజ సంపదను పెట్టుబడిదారీ దేశాలకు దోచిపెడుతూ దేశ పౌరులపై యుద్ధాన్ని ప్రకటించి కగార్ పేరుతో గిరిజనులను చంపుతుందని విమర్శించారు. దేశ ఖనిజ సంపదను కాపాడాలని కోరుతున్న వారిపై దాడులు చేయించడం సరికాదన్నారు. సైనిక బలగాలను వెనక్కి తీసుకుని మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ఉప్పలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు కాశపాక మహేశ్, నాయకులు రవి, చిన్నయ్య, సత్తయ్య, శివలింగం పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- వికలాంగుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి అడివయ్య

కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం ఇస్తున్న వికలాంగుల సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మే 6 : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని వికలాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న 30రకాల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి పాటుపడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో దివ్యాంగులకు 5శాతం శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 5శాతం కేటాయించి, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ దివ్యాంగుల సమస్యలపై జిల్లా అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురుపంగ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, కోశాధికారి లలిత, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

'కొర్రీలు పెట్టకుండా తడిసిన ధాన్యం కొనాలి'

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు రూరల్, మే 6 : కొర్రీలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కొలనుపాక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. అకాల వర్షంతో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగ స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె మల్లేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మామిడాల అంజయ్య, బాశెట్టి రాజు, మామిడాల భానుచందర్, బైరి కాలేందర్, రాజబోయిన కొండల్, బెదరబోయిన సంపత్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మండలంలోని మంతపురి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న కూలీలు, రైతులకు పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'లబ్ధిదారుల ఎంపికపై విచారణ చేయాలి'

మోత్కూరు, మే 6 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, ప్రక్రియపై విచారణ జరిపించాలని బీఎస్‌పీ జిల్లా కో అర్డినేటర్ కొంపెల్లి బాలరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తే గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకు, అనర్హులకు ఇండ్లు కేటాయిస్తూ జాబితాను రూపొందించారన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపి అనర్హులను తొలగించాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పేదలతో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జె.మురళి, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

వలిగొండ, మే 6 : మండలంలోని అరూరు గ్రామానికి చెందిన ఎలిమినేటి శంకరయ్య వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3లక్షల ఎల్ఓసీ మంజూరైంది. ఆ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మాజీ సర్పంచ్ పోలెపాక చెమ్మయ్య, నాయకులు నర్సింహారెడ్డి, చంద్రయ్య, సత్యనారాయణ, యాదయ్య పాల్గొన్నారు

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన వల్లమాల కృష్ణ

కేటీఆర్‌తో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు

వలిగొండ, మే 6 : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లమాల కృష్ణ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి విద్యార్థి, యువజన విభాగాల నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారని వారు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

చెక్‌డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆత్మకూరు(ఎం), మే 6 : గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని ఉప్పలపహాడ్‌లో బిక్కేరు వాగుపై రూ.3.20కోట్లతో నిర్మించనున్న చెక్‌డ్యామ్, రూ.10లక్షల సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను విడుతల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, హంసమ్మ, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలి : డీఎంహెచ్ఓ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్

భువనగిరి కలెక్టరేట్, మే 6 : వేసవికాలంలో ప్రజల ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ సూచించారు. మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా సూచనలు, సలహాలు అందించాలన్నారు. గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, మాతాశిశు సంరక్షణ, అసంక్రమిత వ్యాధులు, బీపీ, షుగర్ వ